# చెర



**దమ్మత మరిసంజీవరావు**

అన్యాయం సాయం కోరింది. బలం అన్యాయంవేపు మొగ్గు చూపింది. ఆ గర్వంతో అన్యాయం అక్రమాలను కొనసాగిస్తున్నది. అసహాయుల ఆక్రందనలు గాలిలో కలిసిపోతున్నాయి.

ప్రజాస్వామ్యం టాంకుల క్రింద పడి నలిగి పోతున్నది. తూటాలు రాజ్యం ఏలుతున్నాయి. గుళ్ళు గుండెల గుండా దూసుకుపోతున్నాయి.

ప్రతిఘటనలు లేకపోలేదు. ప్రతిఘటనలు రోజురోజుకూ ఎక్కువవుతూనే ఉన్నాయి. అయినా— రాక్షసత్వం పెరిగిపోతూంది. అమాయకుల నిండు ప్రాణాలు బలి అవుతూనే ఉన్నాయి.

అందరికీ గుండెల్లో భయం. మనసుతో కసి. కానీ— అసహాయత.

నియంతకూ ప్రజలకూ మధ్య భీకర పోరాటం సాగుతుంది. ఇది అనాదిగా వస్తున్నదే.

పల్లెలు కూలి పోతున్నాయి. పట్టణాలు ధ్వంసం అయిపోతున్నాయి. మంచీ - చెడూ అన్న విచక్షణ ఏనాడో చచ్చిపోయింది.

వీరులూ....

విజ్ఞులూ....

విద్యార్థులూ...

అందరూ ఆహుతై పోయారు.

పరువంలోఉన్న పడతులు పరువు పోగొట్టుకొంటున్నారు. భీరువులు ఓకరాకారం పాదాల క్రింద తలదాచుకుని అడుగులకు మడుగులొత్తుతూ జీవచ్ఛవాల్లా బ్రతుకుతున్నారు. పౌరుషం ఉన్నవారు పంజాదెబ్బ తిని నేల కొరుగుతున్నారు.

ఇదీ ఆ దేశ పరిస్థితి.

అదే బంగ్లాదేశ్.

అది బంగ్లాదేశ్‌లో మారు మూలపల్లె. ఢాకాకు వందమైళ్ళ దూరంలో ఉంది. ప్రకృతి రామణీయకతకు ప్రసిద్ధి గాంచిన ప్రదేశం అది. విషవాయువులు ఇంకా ఆ పల్లెను సోకలేదు. ప్రళయానికిముందు ప్రశాంతతలా ఉందక్కడి పరిస్థితి.

సమీపంలో నుంచి తుపాకులు పేల్చిన శబ్దం వినపడుతూనే ఉంది. అప్పుడప్పుడు విమానాలు పెద్ద శబ్దం చేస్తూ పోతున్నాయి. క్రూరమృగం ఆ గ్రామం దరి

దావుల కెప్పుడు వస్తుందో నని ప్రాణాలర చేతో పట్టుకుని ఉన్నారు. ఏ క్షణాన ఏ మవుతుందో ఎవరూ వూహించలేక పోతున్నారు.

కొందరప్పుడే ఇల్లు విడిచి పారిపోయారు. మిగిలినవారు దేవుడిమీద భారం వేశారు. ధన్ . . . . . దూరంగా పెద్ద శబ్దం. బాంబు పడ్డ శబ్దం వెనువెంటనే మరికొన్ని చప్పుళ్ళు. ఇవన్నీ ఒక్కసారిగా ఆమె ఆలోచనల కంతరాయం కలిగించాయి. ఉలిక్కి పడిందామె. బయటకు వచ్చి చూసింది. అందరూ భయాందోళనలతో బయటకు వచ్చారు. ఎవరూ మాట్లాడ లేదు. మొహాలు చూసుకున్నారు. కాసేపు గడిచింది. శబ్ద మణిగింది. అందరూ లోపలి కెళ్ళిపోయారు.

ఒకసారి చుట్టూ పరికించి చూసిందామె. జరుగుతున్న ఘోరానికి సాక్షులుగా దూరాన కొండలు. పచ్చిక పచ్చి నెత్తురు చవి చూస్తోంది. చీకటి ఇంకా పూర్తిగా పరుచుకో లేదు. మసక మసగ్గా ఉంది. పది రోజుల క్రితం సందడితో లొక్కిసలాడిన గ్రామం ఈనాడు నిర్జనంగా పడి ఉంది. జరుగరానిది ఎప్పుడు జరుగుతుందో అని ఎదురు చూస్తున్నారు.

'ఇక్కా ఎలా ఉందో? అసలు రెండు రోజులుగా తన దగ్గర ఉన్న ట్రాన్సిస్టర్ పలకట్లేదు. తన భర్త, కొడుకు ఏమయ్యారో?' తన వాళ్ళు జ్ఞాపకం వచ్చే సరికి ఆమె కళ్ళు నీళ్లతో నిండాయి.

'తనను ప్రాణపదంగా ప్రేమించే భర్త తన కోసం ఎంత ఆందోళన పడుతున్నాడో.. కొడుకు. నాలుగేళ్ల పసివాడు. ఎప్పుడూ అమ్మా అని వెంట తిరిగేవాడు. తనకోసం ఎంత తల్లడిల్లి పోతున్నాడో? అసలు ఉన్నాడో . . . ఛ . . . ఛ . . ఎంత పాడు ఆలోచన. అందరూ క్షేమంగా ఉంటారు. తనులేదూ?

ఆమె కారోజు జ్ఞాపకం వచ్చింది. అవుట్‌డోర్ షూటింగ్‌కని పదిరోజుల క్రితం తనీ వూరు వచ్చింది. ఇక్కడి ప్రకృతిని చూసి తను ఎంతగానో మురిసి పోయింది. సినిమాతార వచ్చిందని పల్లె ప్రజంతా సంబర పడింది. మధ్యాహ్నం పన్నెండు గంటల వేళ షూటింగు జరుగుతోంది. చూడ్డానికి చాలా మంది వచ్చారు.

తను పచ్చికలో పాట పాడుతూ గెంతుతోంది. ఇంతలో పెద్ద గొడవ జరిగింది. అందరూ పరుగెత్త సాగారు. ఒకరి స్థితి మరొకరికి అవసరం లేకుండా గమ్యం తెలీకుండా పరుగెడు తున్నారు. ఏం జరిగిందో ఎవరూ మాట్లాడట్లేదు. భయముతో బిక్కచచ్చిపోయారు. డైరెక్టర్ మొదలుకొని క్లాప్‌బాయ్ వరకూ అందరూ పారిపోయారు. తన సంగతి ఎవరూ పట్టించుకోలేదు. ఎవరికివారే యమునాతీరే అన్నట్టుంది పరిస్థితి. ఆఖరికి ఒకర్ని అడిగింది. అతను పరుగెత్తుతూ జవాబు చెప్పాడు. "వస్తున్నారు . . . ఆ దుర్మార్గులు . . ఆ పాక్ . . ము . . కొడుకులు. . . . ఛూ . . . మీరూ పారిపోండి". గుండె ఆగినంత పనయింది తనకి. ఎవరెవరు ఎటు పోయారో తెలీదు. తను ఊరివేపు పరుగు తీసింది.

పరుగెత్తి . . . అలిసిపోయి . . తలుపు తెరిచిఉన్న ఇంట్లోకి జొరబడింది. లోపల ఎవరూ లేరు. ఆశ్చర్యం వేసింది. మళ్లీ తనలో తనే అనుకుంది. అందరూ పారిపోయారేమో. అవును . . . పారిపోయుంటారు. తను ఇక్కడ ఉండవచ్చు కొన్ని రోజుల వరకూ . . . . కానీ . .— వాళ్ళు వస్తే . . . దాసి . . . అందరితోపాటే తనూ . . . కొద్దిగా ధైర్యం వచ్చింది. ఇల్లంతా పరీక్షగా చూసింది. రెండే గదులు . . . అందులో ఒకటి వంటగది. వంట పాత్రలు అన్నీ ఉన్నాయి. తీసిచూసింది. వంట చేసింది చేసినట్టే ఉంది. జరిగిన గొడవకి అందరూ తినకుండా పారిపోయారేమో. అదృష్టవశాత్తూ ఎవరూ ధాలేదు. డబ్బాలన్నీ తీసి చూసింది. బియ్యం, పప్పు, ఉప్పు . . . అన్నీ ఉన్నాయి. అప్పటికి


ఆంధ్రప్రదేశంలో అన్ని షాపులలోను దొరుగుచున్నది

# గోపాల్ పళ్ళపొడి



ఆకలి తెలిసి వచ్చింది. మిగిలినవేవీగుర్తుకు రాలేదు వీధి తలుపు వేసివచ్చి కంచం పెట్టుకుని ఆవురావురుమని తినేసింది. ఆ తర్వాత ఒళ్ళు తెలీకుండా నిద్రపోయింది. మళ్ళీ రాత్రి అయింతర్వాత ఎప్పుడో మెలుకువ వచ్చింది. మిగిలిన అన్నం మళ్ళీ ఆకలిని తినేసింది. మళ్ళీ నిద్ర. ఈ పది రోజులూ ఇదే కార్యక్రమం.

ఒకసారి నిట్టూర్చింది. లోపలికి వచ్చి తలుపు వేసింది. విరిగిపోయిన అద్దంలో మొహం చూసుకుంది. మొహం వాడిపోయి ఉంది. తైల సంస్కారంలేని జుట్టు. మాసిపోయిన చీర. షూటింగ్ మేకప్ ఏనాడో పోయింది. ఇప్పుడు తనని ఈవిధముగా చూస్తే 'తార' అని ఎవరూ అనుకోరు. ఆ . . . అదే కావాలి తనకు. తనను నటి అని ఎవరూ గుర్తు పట్టకూడదు. మామూలు పల్లె పడుచులా ఉండాలి. మట్టి చేత్తో ఒకసారి మొహం మీద రాసుకుంది. మొహంమీద, చెంపల మీద మట్టి. తృప్తిగా నవ్వుకుంది.

మళ్ళీ ఆలోచనలు.

ఇంతలో తలుపు మీద దబదబమని చప్పుడు. భయపడుతూ తలుపు తీసింది. ఎదురుగా ఎవరో స్త్రీ. ఒగురుస్తూ ఉంది. "అమ్మా . . . వాళ్ళు వచ్చారు . . . అప్పుడే పదిమందిని . . . ." వెళ్ళిపోయింది.

భయంతో గుండె దడదడ లాడింది.

## చీర

తను వాళ్ళకు దొరికిపోతే . . . అబ్బ . . . ఇంకేమయినా ఉందా . . . . వూహించుకోలేక పోయింది. . . . అంతకంటే చావు నయం . . . కానీ . . . ఎలా . . . వాళ్ళు ప్రతి యిల్లూ వెతుకుతారు. ఇంతలో ఏదో ఆలోచన స్ఫురించింది. తలుపు దగ్గరగా వేసి గడియ పెట్టింది. మూల నున్న గునపం తీసుకుని వెనుకవేపు గోడను బద్దలు కొట్టసాగింది. మట్టి గోడ కావటం మూలాన ఎక్కువ కష్ట పడకుండా ఆమె బయటకు వెళ్ళ గలిగినంత దారి ఏర్పడింది. మెల్లిగా అందులోంచి బయట పడింది. . . . వెనుక నీరులేని కాలువ. అవతల అంతా ఎండిపోయిన జొన్నచేలు.

తుపాకీల మోత . . . బూట్ల చప్పుళ్ళు. వెర్రిగా కేకలు . . . హాహాకారాలు . . . ఆర్తనాదాలు అన్నీ వినిపిస్తున్నాయి.

కాలువదాటి జొన్నచేలో కనపడకుండా దాక్కుంది. కొద్దిగా తలెత్తినా ఆమెకంతా కనిపిస్తుంది. . . . ఆ యింటి తలుపు బద్దలు కొట్టారు. లోపలంతా వెదికారు. "ఛ . . . పిరికి వెధవలు పారిపోయారు . . వీళ్ళ రాజ్యం ఏల్తార్ట!" వెళ్ళిపోయారు పిచ్చిగా నవ్వుతూ. వాళ్ళు వచ్చింది నలుగురు. నలుగురి చేతుల్లోనూ ఆయుధాలు. గంట గడిచింది. సద్దు మణిగింది. మెల్లిగా లేచింది. ఇక తనీ వూళ్ళో ఉండి లాభం లేదు. ఎక్కడి కెళ్ళాలి? గమ్యం లేకుండా కాలిదారంబడి నడవసాగింది. చీకటి చిక్కపడింది. దారి సరిగ్గా కనిపించడంలేదు. మెల్లగా . . . అడుగులో అడుగువేస్తూ . . . . చప్పుడు కాకుండా నడవసాగింది. . . . భయం లేదని నిర్ధారణ చేసుకున్న తర్వాత చెట్టుకింద గడ్డి మీద పడుకుంది. అలసిపోయిన శరీరానికి తొందరగానే నిద్దర పట్టింది.

తెల్లగా తెల్లవారింది. మళ్ళీ నడక. ఆకలి . . . బావి . . . . మంచినీళ్ళు ... మళ్ళీ నడక . . . ఉనికి ఇంకొకరికి తెలీకుండా . . . .

ఎవరో చేయి పట్టుకుని లాగినట్టయింది. తిరిగి చూసింది. ముగ్గురు పళ్ళికిలించి నవ్వారు. తను ఎవరిచేతికి చిక్కకూడదనుకుందో వాళ్ళచేతిలో పడింది. తన గతేంకాను. భయంతో ఒణికి పోసాగింది.

"ఏయ్! ఎవర్నువ్వు?"

"ఈ పక్కనే . . . . మా పల్లె . . ."

ఒకడు పరీక్షగా చూస్తూ దగ్గరగా వచ్చి, మొహంమీది ముంగురులు సవరిస్తూ "ఇది ... ఈవిడ. .. 'తార'లా ఉంది . . ." అన్నాడు.

ఆమె గుండెల్లో రాయి పడింది. తనెవరో తెలిస్తే ఇంకేమయినా ఉందా?

"అదెవరు?" మరొకడు.

"అదా . . . . అది . . . సినిమా యాక్టర్ . . ."

"అదిక్కడెందుకుంటుంది. . . . ఎవత్తయితేనేం . . . వయసులో ఉంది. . .. చాలు . . . తీసుకురండి దాన్ని . . ."


అతను వాళ్ళిద్దరికీ అధికారిలా ఉన్నాడు. ఆమెను అతనికి అప్పగించారు.

కుడి భుజానికున్న తుపాకీ ఎడంవేపుకి మారింది. సిగరెట్టు కిందపడేసి రెండు చేతులూ బలంగా భుజాల మీద వేశాడు.

"నన్ను వదిలిపెట్టు. నీకు పుణ్యముంటుంది. నీకు చెల్లెలు లాటిదాన్ని..."

జవాబుగా నవ్వేడు. చేతులు మరింత బిగుసుకున్నాయి. మిగిలిన ఇద్దర్నీ ఉద్దేశిస్తూ, "మీరిద్దరూ . . . బాగా వెనక్కి వెళ్ళండి . . . ఇటు చూడకుండా . . "

వాళ్ళిద్దరూ మొహాలు చూసుకుని, నవ్వుకుని వెళ్ళిపోయారు.



ఆమెను మరోవేపుకి లాక్కు వెళ్ళాడు. 'ఇక్కడ బావుంది' తనలోతనే అనుకున్నాడు. "ఇసుక మెత్తగా ఉంటుంది కదూ . . . ." నవ్వాడు. తుపాకి కింద పడేసి ఆమె మీదికి పులిలా లంఘించాడు. ఆమె పెనుగులాడ సాగింది. అరిస్తే ఎవరు పాయుంవస్తారు? అతను చీర లాగుతున్నాడు. చీరకుచ్చిళ్ళను రెండు చేతుల్తో గట్టిగా పట్టుకుంది. ఫర్‌మని చిరిగింది చీర. చిరుగరానిచోట . . . అసహ్యంగా . . ఆమె శరీరంమీద ఆమెకే అసహ్యంవేసేలా చిరిగింది. అతను ఆకలిగా చూస్తూ ఆమె మీదకి ఉరికాడు. కిందపడి పోయిందామె. నలిగిపోతోంది. కోసంతో పిడికిలి మూసుకుంది. పిడికిట్లో గుప్పెడు ఇసుక. . . . క్షణంలో మెరుపులాటి ఆలోచన. . . . బలాన్నంతా కూడ దీసుకుని . . . ఒకసారి చేయివిసిరింది. . . . సరిగ్గా క్షణంలోకి . . . అతడి కళ్ళనిండా ఇసుక . . . 'అబ్బా' అతనిబాధ . . . పట్టు సడిలింది. ఆమె బయటపడింది. మెరుపులా తుపాకి అందుకుంది. కళ్ళు మూసుకుని గురిపెట్టింది. వరుసగా నాలుగ్గుళ్ళు అతని గుండెల్ని చీల్చాయి. కిక్కురుమనకుండా పడిపోయాడతను. ఇసుక ఎర్రబడింది.

తుపాకి వదిలి పరుగు లంకించుకుంది. పరుగు . . . . ఒకటే పరుగు . . . పరుగులాటి నడక . . . . నడక . . . ఆయాసము . . . విశ్రాంతి . . . మళ్ళీ పరుగు.

చీకటి పడ్తూండగా ఏదో వూరు చేరింది. చిన్నది కాదు. పెద్ద వూరే. బస్సులు . . . కార్లు . . .దుకాణాలు అన్నీ ఉన్నాయి. అందరి కళ్ళు ఆమె మీద ఉన్నాయి. పళ్ళికిలింపులు . . .కళ్ళు అర్పటాలా... చేతులు రాసుకోటాలా . . . అన్నీచూసింది మగాళ్ళ చూపులన్నీ ఒకేమాదిరిగా కనిపించాయి. సాధ్యమయినంత చీకట్లో నడవ సాగింది.

నడుస్తూ బట్టలకొట్టుముందు ఆగింది. చీరలన్నీ కుప్పగా పోసిఉన్నాయి. అన్నీ రంగు రంగుల చీరలు. ఎర్రవీ . . .నల్లవీ . . . తెలుపువీ . . . పువ్వుల చీరలూ . . . అన్ని రకాలూ ఉన్నాయి. . . . లోపల అంతా హడావిడిగా ఉన్నారు. ఏదో బేరం తెగక గట్టిగా వాదించుకుంటున్నారు. చుట్టూ చూసింది. ఎవరూ గమనించటంలేదు. మెల్లిగా వో చీర తీసుకుని అక్కడ్నించి తప్పుకుంది.

చీకటిచాటున చీర కట్టుకుంది. అప్పటికి గాని ఆమెకు తనెక్కడున్నానన్న ఆలోచన రాలేదు. 'ఇదేవూరు?' అందరూ హిందీలో మాట్లాడుతున్నారు. బెంగాళీ



చాలా తక్కువ. దారిన పోతున్న ఎవరినో అడిగింది. జవాబు విని చాలా సంతోషించింది. తనున్నది ఇండియాలో, ఇక తనకేం భయంలేదు.

ఖాళీగాఉన్న అరుగుమీద నిశ్చింతగా నిదురపోయింది. తెల్లవార్తూ ఉండగా పోలీసులు వచ్చి లేపిన తర్వాతగాని ఆమెకి

## చీర

మెలుకువ రాలేదు.

* * *

కోర్టునిండా జనం. చీర దొంగిలించిన చిన్నదాన్ని చూడాలని చాలామంది వచ్చారు. ఆమెను చూసి గుసగుసలాడుకొంటున్నారు.




మేజిస్ట్రేటు వచ్చి బల్లమీద చప్పుడు చేసింతర్వాత గాని గుసగుసలు ఆగిపోలేదు.

ఆమె బోనులో నుంచొని ఉంది. ఆమె కట్టిన రంగులచీర ఇంకా మాసిపోలేదు.

“చీర దొంగిలించావని నీ మీద ఆరోపణ. దీనికి నీ సమాధానం.”

గొంతు సవరించుకుంది. “యువరానర్! నేను చీరను దొంగిలించిన మాట మాత్రం వాస్తవమే. దానికి ఏ శిక్షయినాసరే సంతోషంగా అనుభవిస్తాను. కానీ . . . నేను ఏ పరిస్థితుల్లో నేరం చేశానో మీరు తెలుసుకోవాలి. స్త్రీకి ముఖ్యమయినది శీలం. ప్రాణంపోయినా సరే ఆమె తన మానాన్ని కాపాడుకోవాలి. అందుకు నేను ఒక చిన్న దొంగతనం మాత్రం చేశాను. నేను అప్పుడు కట్టుకున్న చీర పోలీసువారి అధీనంలో ఉంది. అది కట్టుకున్న ఆడది తన శరీరాన్ని ఎంతవరకు కప్పుకోగలుగుతుందో కోర్టువారే నిర్ణయించాలి. పయిగా ఈ దొంగతనం నేను చేయకపోతే నా మీద ఎన్నో అత్యాచారాలు, అఘాయిత్యాలు జరిగేవని మీరు గమనించాలి.”.

కోర్టులో కలకలం బయలు దేరింది. ఆమెను విడిచిపెట్టమని అందరూ అరుస్తున్నారు.

ఒకసారి మేజిస్ట్రేటుగారు సాలోచనగా ఆమెవేపు చూశారు. “నీ పేరు?”

“తార”

“భర్త పేరు?”.

చెప్పింది.

“నివాసం?”

“డక్కా, బంగ్లాదేశ్!”

‘సెట్‌హర్‌ఫ్రీ’ అందరూ గట్టిగా అరిచారు.

మేజిస్ట్రేటుగారు మరి మాట్లాడలేకపోయారు.

ఫ్లాష్‌బల్బులు క్షణంసేపు వెలిగి ఆరిపోయాయి.